నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

5 | మంగళవారం 5 మార్చి 2024 | WARANGAL HANUMAKONDA




ఆలయం వద్ద ఇరువర్గాల వాగ్వాదం

# గట్టమ్మ మాదే.. కాదు మాదే..!

## దేవాలయంపై ముదిరిన లొల్లి

### ఆదివాసీ నాయకపోడులు, ముదిరాజ్‌ల మధ్య ఘర్షణ

### పోలీసుల జోక్యం.. జాకారం గ్రామస్తులపై కేసు

*మొదటి మొక్కుల తల్లి గట్టమ్మ దేవాలయంపై రగడ నడుస్తున్నది. తమ తాత ముత్తాతల నుంచి తామే పూజారులమని నాయకపోడులు చెప్తుంటే.. కాదు, 1953 నుంచి తామే గట్టమ్మ పూజారులమని, హైకోర్టు సైతం తమకు ఆర్డర్ ఇచ్చిందని ముదిరాజ్‌లు అంటున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. ఈ వివాదం గాలివానలా మారి సోమవారం గట్టమ్మ సాక్షిగా ఘర్షణకు దారి తీసింది.*

*– ములుగురూరల్, మార్చి 4*


గాయాలను చూపిస్తున్న నాయకపోడు మహిళా పూజారి

ములుగు గట్టమ్మ దేవాలయంపై పట్టు కోసం జాకారానికి చెందిన ముదిరాజ్‌లు, గ్రామస్తులు, ములుగు ఆదివాసీ నాయకపోడు పూజారుల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. ఆలయం వద్ద పూజల్లో ఉన్న నాయకపోడు మహిళలకు గాయాలయ్యాయి. విషయం తెలిసి డీఎస్పీ రవీందర్, ములుగు, పస్రా సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, ములుగు, వెంకటాపూర్, పస్రా ఎస్సైలు వెంకటేశ్వర్, రాజు, మస్తాన్ అక్కడికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తుండగానే ఘర్షణ చోటు చేసుకోగా పోలీసులు చెదరగొట్టారు. అనంతరం ఇరువర్గాలవారు ఆలయ ఆవరణలో బైఠాయించారు.

### పూర్వం నుంచి మేమే పూజారులం : నాయకపోడులు

70, 80 ఏళ్లుగా నాయకపోడులే గట్టమ్మ పూజారులుగా ఉన్నారని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్, పూజారులు తెలిపారు. తమ తాత ముత్తాల నుంచి వారసత్వంగా ఆలయం వద్ద పూజారులుగా కొనసాగుతున్నామన్నారు. గతంలో ములుగు పరిధిలో కెనాల్ కింది భాగంలో చింతచెట్టు కింద ఉన్న బాల గట్టమ్మను 1960లో పూజారి కొత్త లక్ష్మయ్య, మరి కొందరు కలిసి ఎత్తు ప్రాంతమైన ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారని చెప్పారు. 2000 సంవత్సరంలో కొందరు రాజకీయ లబ్ధికోసం ఈ భూములు జాకారం పరిధిలోకి వస్తాయని చెప్పి గొడవలు సృష్టించారని చెప్పారు. 2015లో కోర్టు పూర్తి హక్కులు తమకేనని తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. 1956లో జహీర్‌అహ్మద్‌ఖాన్ అనే అధికారి ఊరి కొకరిని తీసుకొచ్చి జాకారాన్ని ఏర్పాటు చేశారని, 1954లో ములుగు పరిధిలో గట్టమ్మపల్లె అనే ఊరు ఉండేదని అది కాలిపోతే రోడ్డు వైపు వచ్చి ఇండ్లు కట్టుకున్నారని చెప్పారు. గట్టమ్మ పల్లెకు అప్పటి ప్రాజెక్టు డైరెక్టర్ ప్రేమ్‌నాథ్‌మాథూర్‌సాబ్ పేరుతో ప్రేమ్‌నగర్ అని పేరు పెట్టినట్లు వివరించారు. 1956లో వచ్చిన జాకారం గ్రామస్తులు ఎలా పూజారులవుతారని ప్రశ్నించారు. నాయకపోడులపై దాడిని ఖండిస్తున్నట్లు పోడ్‌దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షుడు దబ్బా సుధాకర్, పొలిట్ బ్యూరో మెంబర్ బొల్లెం సారన్న, జాతీయ కో ఆర్డినేటర్ నెమలి నర్సయ్య మాదిగ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముదిరాజ్‌లపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### కోర్టు ఆర్డర్ ఉంది: ముదిరాజ్‌లు

గట్టమ్మ ఆలయం హైకోర్టు ఆర్డర్ ప్రకారం తమకే చెందుతుందని ముదిరాజ్ పూజారుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు ఈర్ల చేరాలు, సభ్యులు వెల్లడించారు. గతంలో గట్టమ్మ వద్ద గుడి, గద్దెలను కట్టించింది కూడా తామేనని తెలిపారు. 1953 నుంచి తామే గట్టమ్మ పూజారులమన్నారు. నాయకపోడులు అడ్డు వచ్చి ఆటంకాలు సృష్టిస్తూ తమపై దొంగ కేసులు పెట్టారన్నారు. 2016లో తమకు కోర్టు ఆర్డర్ వచ్చిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం, తమ నిర్లక్ష్యం వల్ల ఆలస్యమైందని వివరించారు. కోర్టు ఆర్డర్ ప్రకారం ప్రస్తుతం తాము గట్టమ్మ ఆలయానికి వచ్చినట్లు తెలిపారు. 'మా గట్టమ్మను మేమే తీసుకుంటా'మని అధికారులందరికీ పిటిషన్లు ఇచ్చినా వారు స్పందించడం లేదని ఆరోపించారు.

### జాకారం గ్రామస్తులపై కేసు

జాకారానికి చెందిన ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. ఆదివాసీ నాయకపోడులపై దాడిచేశారని గట్టమ్మ పూజారి కొత్త సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈర్ల చేరాలు, రమేశ్, రఘు, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.


మహబూబాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు

### బయోడేటా..


**పేరు:** మాలోత్ కవిత

**తల్లిదండ్రులు:** ధరంసోత్ రెడ్యానాయక్, లక్ష్మి

**భర్త:** భద్రూనాయక్

**సంతానం:** కూతురు మహతి, కుమారుడు నయన్

**రాజకీయ ప్రవేశం:** 2008 కాంగ్రెస్‌లో చేరిక, 2009లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా గెలుపు, 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, 2019లో మహబూబాబాద్ ఎంపీగా గెలుపు



# మానుకోట.. మాలోత్ కవితకే..

### ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్.. స్థానిక నేతల్లో హర్షం

మహబూబాబాద్, మార్చి 4 (నమస్తే తెలంగాణ) : మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవితను పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఖరారు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధి ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడాల నుంచి దేశంలోనే తొలి మహిళా ఎంపీగా గుర్తింపు పొంది.. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి నాయకులతో కలుపుగోలుగా ఉంటూ పాలనలో సమర్థవంతంగా ముందుకెళ్తున్న ఆమె నాయకత్వ పటిమను చూసి కేసీఆర్ మరోమారు అవకాశం ఇచ్చారు.

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో 1980, జనవరి 1న కవిత జన్మించారు. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. తన తండ్రి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ నుంచి రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జనరల్ స్థానంగా ఉన్న మహబూబాబాద్ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్ అయ్యాయి. అవకాశం కలిసిరావడంతో 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తిరిగి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్ చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. 2019లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై 1.50 లక్షల మెజార్టీతో గెలుపొందారు. కాగా, రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం మహబూబాబాద్ స్థానం నుంచి మరోమారు ఆమె అభ్యర్థిత్వాన్ని బీఆర్ఎస్ అధిష్టానం ఖరారు చేసింది.

### బీఆర్ఎస్ నేతల్లో జోష్

మహబూబాబాద్ పార్లమెంట్ స్థానానికి ప్రధాన పార్టీల కంటే ముందుగానే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించడంతో స్థానిక నేతల్లో జోష్ నెలకొంది. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీలకు చెందిన ముఖ్య నాయకులు ఇందులో పాల్గొనగా, అభ్యర్థి ఎంపికపై చర్చించారు. వారి అభిప్రాయాలను సేకరించిన అనంతరం మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత పేరును అధినేత కేసీఆర్ ప్రకటించారు.

**త్వ**రలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరేయాలని నాయకులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సూచించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014, 2019లో వరుసగా బీఆర్ఎస్ పార్టీ మానుకోట పార్లమెంట్ స్థానాన్ని గెలుచుకున్నదని, త్వరలో జరిగే ఎన్నికల్లో కూడా విజయం సాధించి, హ్యాట్రిక్ కొట్టేలా చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇప్పటికే పలు సర్వేల్లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ గెలుస్తుందని తేల్చాయని, నాయకులు సమన్వయంతో పనిచేసి మరోమారు అభ్యర్థిని

### మానుకోటపై గులాబీ జెండా ఎగరాలి

**కవితను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి**

**ముఖ్య నేతల సమావేశంలో కేసీఆర్**

గెలిపించాలని కోరారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కారు రాష్ర్టానికి చేసిందేమీ లేదనే విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా ఇటీవల అనేక అసత్య వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, సంక్షేమ పథకాల అమలులో చేస్తున్న జాప్యాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అందరూ కష్టపడి పనిచేసి మానుకోటపై మూడోసారి గులాబీ జెండా ఎగరేయాలన్నారు. ఎంపీ కవిత మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా మరోమారు తనకు అవకాశం ఇచ్చిన అధినేత కేసీఆర్‌కు ఎంపీ కవిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, శంకర్‌నాయక్, హరిప్రియానాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, బడే నాగజ్యోతి పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో వాజేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులతో కలిసి ధర్నా చేస్తున్న గుడిసెవాసులు

## తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించండి..

### వాజేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గుడిసెవాసుల ధర్నా

వాజేడు, మార్చి 4 : తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గుడిసెవాసులు ములుగు జిల్లా వాజేడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. వాజేడు మండలంలోని మండపాక గ్రామ శివారులో ప్రభుత్వ భూమిలో ఇటీవల కొందరు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. కరెంట్, తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు నివాసం ఉంటున్న వారందరికీ ఇంటి పన్నులు ఇవ్వాలంటూ సోమవారం సీపీఎం నాయకులతో కలిసి కుటుంబాలతో సహా రెండు కిలోమీటర్లు ర్యాలీగా వచ్చి ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఖాళీబిందెలతో మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి గంట పాటు ధర్నా చేశారు. ఈమేరకు ఎంపీవో శ్రీకాంత్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొప్పుల రఘుపతిరావు, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, సౌమ్య, గుడిసెవాసులు ప్రవీణ్, భీమయ్య, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డెక్కిన దళితబంధు లబ్ధిదారులు

**రెండో విడుత నిధులు విడుదల చేయాలని డిమాండ్**

**లేదంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేస్తామని హెచ్చరిక**

**భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా**

కృష్ణకాలనీ, మార్చి 4 : భూపాలపల్లిలోని దళితబంధు రెండో విడుత లబ్ధిదారులు సోమవారం రోడ్డెక్కారు. గ్రౌండింగ్ పూర్తయి కలెక్టర్ ఖాతాలోకి చేరిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తామంటూ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర దళితబంధు ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నముండ్ల సంపత్ మహరాజ్ మాట్లాడుతూ దళిత పక్షపాతి అంటూ కపట మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వారిని పూర్తిగా విస్మరించిదన్నారు. గత ప్రభుత్వం రెండో విడుత లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఖాతాలో నిధులు జమచేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విడుదల చేయకుండా దళితులను మోసం చేసిందన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడతామని ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ నాయకులు దళితులను ఎందుకు పట్టించుకోవడం లేదో తెలపాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దళితులంటే చిన్నచూపన్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధిదారులమంతా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి దళితుల జీవన స్థితిగతులను తెలుసుకొని రెండో విడుత నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకుడు రామిళ్ల కిరణ్, టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య, ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల మహేశ్, నాయకులు జక్కయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య, రామన్న, రాజబాబు, సమ్మయ్యతో పాటు 100మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.


దళితబంధు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

## కరెంట్ పంజాకు ముగ్గురు బలి

**నాలుగేళ్ల బాలుడి పరిస్థితి విషమం.. పర్వతగిరి మండలం మోత్యాతండాలో విషాదం**

**దుర్గమ్మ పండుగ ఏర్పాట్లలో ప్రమాదం.. టెంట్ వేస్తుండగా విద్యుత్ వైరు తెగిపడి ఘోరం**

**పర్వతగిరి, మార్చి 4 : పండుగ సంబురంలో మునిగిన ఆ తండాలో ఒక్కసారిగా తీరని విషాదం అలుముకుంది. దుర్గమ్మ వేడుకల కోసం ఏర్పాట్లు చేసుకుంటుండగా విద్యుదాఘాతానికి గురై ముగ్గురు మృత్యువాతపడడం ఉమ్మడి జిల్లావాసులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం మోత్యాతండాలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఘోరం అందరినీ కలిచివేసింది.**

పర్వతగిరి మండలం మోత్యాతండాలో సోమవారం రాత్రి విద్యుత్ వైరు తెగిపడి ముగ్గురు మృత్యువాతపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాలో దుర్గమ్మ పండుగను జరుపుకొనేందుకు తండావాసులు ఏర్పాట్లు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఎవరికి వారు బోనాలు చేసుకొని మంగళవారం పండుగ జరుపుకొనేందుకు బంధువులను పిలుచుకున్నారు. తమ ఇండ్ల ముందు టెంట్లు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 8గంటల సమయంలో తండాకు చెందిన భూక్య రవి(30) టెంట్ వేస్తుండగా విద్యుత్ వైరు తెగి అతడి ఇంటి ముందు పడింది. ఆ సమయంలో అక్కడే ఉన్న అతడి బావ రాయపర్తి మండలం గట్టికల్‌కు చెందిన గుగులోత్ దేవేందర్(32), టెంట్ వేసేందుకు వచ్చిన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జమస్తాన్‌పురానికి చెందిన సునీల్(20) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. దవాఖానకు తీసుకెళ్తుండగా రవి మార్గమధ్యలో చనిపోయాడు. రవి కొడుకు నాలుగేళ్ల చిన్నారి జశ్వంత్ తీవ్ర గాయాలతో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ముగ్గురి మృతితో తండాలో తీవ్ర విషాదం నెలకొంది. అయితే విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఓవర్ లోడ్‌తో తీగలు తెగి పడ్డాయని, గతంలో ఓవర్‌లోడ్ విషయమై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు.


భూక్య రవి (ఫైల్)


గుగులోత్ దేవేందర్ (ఫైల్)


సునీల్ (ఫైల్)

## మంత్రపు పెట్టెతో మోసం..

- కోటేశ్వరులవుతారని నమ్మించే యత్నం
- పెంబర్తి వద్ద నలుగురి అరెస్ట్, ఆటో సీజ్
- జనగామ ఏసీపీ దామోదర్‌రెడ్డి వెల్లడి


మంత్రపు పెట్టెను చూపుతున్న ఏసీపీ దామోదర్‌రెడ్డి


జనగామ చౌరస్తా, మార్చి 4 : అలీబాబా అద్భుత దీపం.. అర డజను దొంగలు వంటి కథలను పుస్తకాల్లో చదివాం. సినిమాల్లో మాత్రమే చూశాం. కానీ నిజ జీవితంలో అమాయకులను మోసం చేసేందుకు మంత్రపు పెట్టెకు అద్భుత శక్తులున్నాయని నమ్మించి, మోసం చేసేందుకు యత్నించిన నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం జనగామ అర్బన్ పీఎస్‌లో ఏసీపీ ఎస్ఆర్ దామోదర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్‌కు చెందిన కేతావత్ శంకర్ (ప్రస్తుతం హైదరాబాద్), నారాయణపేట జిల్లా మక్తల్ మండలం సంఘంబండకు చెందిన ఖాసీం, వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన మహ్మద్ అజార్, నల్లగొండ జిల్లా దిండి మండలం దేవత్‌పల్లి తండాకు చెందిన కొర్ర గాసిరాం ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలని నిర్ణయించుకుని అమాయకులను మోసం చేసేందుకు పథకం రూపొందించారు. ఆకాశం నుంచి ఉల్కలు తెగి కిందపడినపుడు వారికి ఓ మంత్రపు పెట్టె దొరికిందని, దానికి అద్భుతమైన శక్తులు ఉన్నాయని అమాయకులను నమ్మించారు. అది ఎవరి దగ్గర ఉంటే వారి జాతకం మారిపోయి వెంటనే కోటీశ్వరులు అవుతారని మభ్యపెట్టేందుకు యత్నించారు. ఈ నేపథ్యంలో వరంగల్‌కు చెందిన ఒకరికి మంత్రపు పెట్టెను రూ.50 కోట్లకు విక్రయించేందుకు ఆటోలో నలుగురు కలిసి మంత్రపు పెట్టెతో బయల్దేదారు. ఈ క్రమంలో జనగామ మండలం పెంబర్తి వై జంక్షన్ వద్ద సోమవారం పోలీసులకు చిక్కారు. వీరిని పోలీసులు విచారించగా నేరం ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ దామోదర్‌రెడ్డి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అర్బన్ సీఐ ఎల్ రఘుతో పాటు ఎస్సై సృజన్, కానిస్టేబుళ్లు రామన్న, కరుణాకర్, అనిల్ కుమార్, సాగర్‌ను వెస్ట్‌జోన్ డీసీపీ పీ సీతారాం, ఏసీపీ దామోదర్‌రెడ్డి అభినందించారు.

## సాగునీటి కోసం రైతుల ధర్నా

**ఎస్సారెస్పీ డీబీఎం-31, అనంతసాగర్ వద్ద ఆందోళనలు**

**పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన**

దామెర/హసన్‌పర్తి, మార్చి 4: సాగునీటి కోసం రైతులు ఆందోళనకు దిగారు. దామెర మండలం పులుకుర్తి, పసరగొండ గ్రామాల రైతులు సోమవారం ల్యాదెళ్ల, ఆరెపల్లి ఎస్సారెస్పీ డీబీఎం–31 వద్ద ఆందోళనకు దిగారు. సాగునీరు అందక చివరి ఆయకట్టులోని మక్కజొన్న పంట ఎండిపోతోందని, ఎక్కువ నీటిని విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు సంజీవయ్య, దుబాసి రవి, సముద్రాల రాజు, సముద్రాల మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ నీటిని విడుదల చేయాలని పది రోజులుగా ఎస్సారెస్పీ అధికారులను కోరుతున్నా స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం మక్కజొన్న పంట వందలాది ఎకరాల్లో పీచుదశలో ఉందని, నీరులేక కళ్లముందే పంట ఎండిపోతున్నదని వాపోయారు. మెయిన్ కెనాల్ నుంచి డీబీఎం–31కు ఎక్కువ నీటిని విడుదల చేస్తేనే చిన్న కాల్వల ద్వారా పంటలకు నీరందుతుందని పేర్కొన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సారెస్పీ ఏఈ గోవర్దన్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. ఎక్కువ నీటి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.


దామెర: సాగునీరు అందించాలని ఆందోళన చేస్తున్న రైతులు

రైతులు ముంద్రాతి రవి, మేడిపల్లి శ్రీనివాస్, పాలడుగుల సాంబయ్య, లింగాల రాజు పాల్గొన్నారు. అలాగే కమలాపూర్ మండల రైతులు సోమవారం హసన్‌పర్తి మండలం అనంతసాగర్ ఎస్సారెస్పీ కెనాల్‌పై ధర్నా చేశారు. ఎస్సారెస్పీ కెనాల్ నుంచి పిల్లకాల్వల ద్వారా వస్తున్న సాగునీటిని అనంతసాగర్ రైతులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఫలితంగా నీరు అందక తమ పంటలు ఎండిపోతున్నాయని పేర్కొన్నారు. ఎస్సారెస్పీ అధికారులు స్పందించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.